# మతతత్వ శక్తులను తరిమి కొట్టాలి

- బీఆర్ఎస్ ప్రకటించే మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు మెంటలెక్కడం ఖాయం
- దశలవారీగా డబుల్ బెడ్ రూం ఇండ్లు
- ఎమ్మెల్యే దానం నాగేందర్



జహీరానగర్‌లో షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్/ హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 30: మతతత్వ శక్తులను తరిమి కొట్టి దేశాన్ని కాపాడు కోవాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శని వారం పర్దాగేట్‌లో అర్హులైన 39 మందికి షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ఎంత పించన్లు ఇచ్చారో ప్రజలందరికీ తెలుసని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పించన్లను పెంచి అందజేయడం జరుగుతుందన్నారు. షేర్‌ఘాట్ ,పర్ధాగేట్‌లో సీ,సీ రోడ్లు నిర్మాణ పనులకు రూ.76లక్షలు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరణ చేసేందుకు రూ.2కోట్ల నిధులతో మంజూరైనట్లు తెలిపారు. పగటి వేశగాళ్ల అవతారమెత్తి తిరుగుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేప్పే మాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. నాంపల్లి తాసీల్దార్ ప్రేమ్‌కుమార్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ప్రేరాజు, బీఆర్ఎస్ నాయకులు మన్సూర్, సోయల్ జాబ్రీ, ఎక్బాల్, ముజాఫర్ ముసా తదితరులు పాల్గొన్నారు.

**మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట ..**

మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. శనివారం హైదర్‌గూడలోని సెయింట్ పాల్స్ స్కూల్ లైన్‌లో రూ.17లక్షల వ్యయంతో మంచినీటి నిర్మాణ పనులకు హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్‌తో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి దశల వారీగా పలు అభివృద్ధి పనులు చేస్తున్నామని, నిరుపేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడ జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎం సన్యాసీరావు, మేనేజర్ మహేందర్‌రెడ్డి,బీజేపీ నాయకులు జి.రామన్ గౌడ్, మహేష్, నర్సింగ్‌గౌడ్,బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు యాదగిరి సుతారి, నాయకులు అశోక్‌కుమార్,పి.ప్రభాకర్‌గౌడ్, డి.రాజేందర్‌కుమార్, యతిరాజు, సర్ఫరాజ్, కొల్కుల శ్రీకాంత్, నందు, పాలడుగు శ్రీనాథ్, ఎన్.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మురుగు సమస్యల పరిష్కారానికి రూ.2.70కోట్లు..**

ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్ డివిజన్ల పరిధిలో మురుగు సమస్యల పరిష్కారం కోసం రూ.2.70 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నం.10లో జలమండలి అధికారులతో ఎమ్మెల్యే దానంనాగేందర్ పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. జలమండలి జీఎం హరిశంకర్, మేనేజర్లు ఇతర అదికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు బస్తీల్లో మురుగు సమస్యలను పరిష్కరించేందుకు కొత్త సీవరేజ్ లైన్లు వేయాల్సి ఉంటుందని, 24 పనుల కోసం రూ.2.70కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జహీరానగర్, ఉదయ్‌నగర్, గౌరీశంకర్ కాలనీ, చింతల్‌బస్తీ. ప్రేమ్‌నగర్, జవహర్ నగర్ ప్రాంతాల్లో సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామని జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు. ఇదిలా ఉండగా జహీరానగర్‌లో ఖాళీ పార్కు స్థలం ఉందని, సరైన నిర్వహణ లేకపోవడంతో అసాంఘికశక్తులకు అడ్డాగా మారిందని స్థానికులు ఎమ్మెల్యే దానం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే పార్కును అభివృద్ధి చేయాలని జోనల్ కమిషనర్ వెంకటేశ్‌ను కోరారు. జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం అధికారులను పంపించి పార్కు అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక తీసుకుంటామని రెండుమూడురోజుల్లో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసిన అనంతరం పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు.

**తెలంగాణ ప్రజలకు కేసీఆర్ గ్యారంటీ ..**

పేదల కోసం నిరంతరం పనిచేస్తూ వారికి అండగా నిలబడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే తెలంగాణ ప్రజలకు గ్యారంటీ అని, కేవలం ఎన్నికల కోసమే గాలిమాటలు చెప్పే ప్రతిపక్ష పార్టీలకు ఎన్నికల తర్వాత అడ్రస్ కూడా ఉండదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని జహీరానగర్‌కు చెందిన 18మందికి షాదీ ముబారక్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే దానం నాగేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గ్యారంటీ అయినా, వారంటీ అయినా కేసీఆర్ మాత్రమే అని, ఇతర పార్టీలు చెప్పే గ్యారంటీలను ఎవరూ నమ్మబోరన్నారు. రానున్న ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీజేపీలు కనుమరుగు కావడం మాత్రం గ్యారంటీ అని జోస్యం చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రజల మధ్యన మతం పేరుతో చిచ్చు పెట్టడం మాత్రమే బీజేపీకి తెలుసని, అలాంటి పార్టీ తరపున ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఒక్కటైనా మంచి పనిచేశారా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తప్ప ఇతర పార్టీలకు ఓటేస్తే మతతత్వ శక్తులకు ఊతం ఇచ్చిన వారవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు జావెద్, ఆంథోనీ, వెంకటస్వామి, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌గూడలో మంచినీటి పైపులైన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దానం



పర్దాగేట్‌లో షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

## ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 30 : ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కెట్ రోడ్‌లో ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, మృతదేహాన్ని ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడు గులాబీ రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాత నగరంలో మెట్రో రైలు పనులు చేపట్టండి




హైదర్‌గూడలోని ఎన్ఎస్ ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఈ.టీ నరసింహ తదితరులు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 30 : పాత నగర ప్రజలు మెట్రోరైలు కోసం దీర్ఘకాలికంగా ఎదురుచూస్తున్నారని మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టాలని పాత నగర మెట్రోరైల్ జేఏసీ నాయ కులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ టీ నరసింహ, నగర కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, టీపీసీసీ కార్యదర్శి కె. వెంకటేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పాత నగరంలో సుమారు 30 లక్షలపై చిలుకు జనాభా ఉందని, నిత్యం వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారికి మెట్రో రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మెట్రో రైలు ఉండటం వల్ల పాత నగరంలోని ప్రజలకు ఉపాధి పెరగడంతో పాటు ఆ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించి మెట్రో రైలు ఏర్పాటు కోసం పనులు ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు ఉస్మాన్ బిన్ మొహ్మద్ ఆల్ హాజరీ, రవీంద్రచారి, సయ్యద్ సలీం, కమతం యాదగిరి, మూస, హైదర్‌జాఫ్రి పాల్గొన్నారు.

## కేబీఆర్ పార్కువద్ద వరల్డ్ గర్ల్ చైల్డ్ డే వాక్



అంతర్జాతీయ ఆడపిల్లల దినోత్సవం సందర్భంగా లోటస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్‌వద్ద వాక్ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షించండి.. ఆడపిల్లలను చదివించండి అంటూ ప్లకార్డులు పట్టుకున్న వైద్యులు. విద్యార్థులు వాక్‌లో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ అన్ని రంగాల్లో మహిళలు దూసుకువెళ్తున్నారని, వారిపై వివక్షను మానుకోవాలని లోటస్ ఆస్పత్రి సీఈవో డా.వీఎస్‌వీ.ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో డా. హేమప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **– బంజారాహిల్స్, సెప్టెంబర్ 30**

## 4న ఎస్సీ ఉపకులాల ఆత్మగౌరవ సభ



ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 30 : నగరంలోని ధోబీఘాట్ మైదానంలో ఈ నెల 4న 57 ఉపకులాల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం నాయకులు కత్తి మల్లయ్య బేడ బుడగ జంగం, టీఎన్ స్వామి మిత అయ్యాల్వార్, తులసీదాస్ గైక్వాడ్ మాంగ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ రాష్ట్రంలో 22 లక్షల జనాభా ఉన్న దళితుల్లో 34 శాతం ఉపకులాలు ఉన్నాయన్నారు. ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో అత్యంత వెనుకబడి ఉన్నారన్నారు. సంచార జీవనం గడుపుతున్నారని, మరికొందరు చేతి వృత్తులు, కళారూపాల ప్రదర్శనలతో బతుకీడుస్తున్నారన్నారు. ఉప కులాల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 2వేల కోట్ల నిధులను కేటాయించాలన్నారు. 4న జరిగే సభకు ముఖ్య అతిథులుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్, కొమురం భీం మనవడు కొమురం సోనేరావు భీం హాజరవుతున్నారని, ఉప కులాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## సన్మానం..



ఫ్రెండ్ షిప్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 11 అడుగుల ఎకో గణేశుడిని ప్రతిష్ఠించడంతో పాటు మండపం వద్దే కొలను ఏర్పాటు చేసి నిమజ్జనం చేశారు. తద్వారా ఎలాంటి కాలుష్యానికి తావు లేకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా వినూత్నంగా ఆలోచించిన నిర్వాహకులు ఎస్‌కె ఓమర్ అలియాస్ చోటు, శ్రీనివాస్, మహేవ్ రెడ్డి, అల్తాఫ్, అరుణ్ కుమార్ బృందాన్ని శనివారం పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్, సీఐ దుర్గారావు శాలువాతో సత్కరించారు. **– ఖైరతాబాద్, సెప్టెంబర్ 30**

## స్వచ్ఛ భారత్..

హిమాయత్‌నగర్,సెప్టెంబర్ 30 : గాంధీజీ జయంతి పురస్కరించుకుని శనివారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్‌సీసీ విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలలో ఉన్న చెత్త, చెదారం ఊడ్చి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యనారాయణ, ఎన్‌సీసీ ఆఫీసర్ డి.దేవయ్య పాల్గొన్నారు.